# లక్ష్మి

రచన :
ము. కృష్ణమూర్తి, పట్నాయక్

'పెదనాన్నగారూ! నాకు రైలుబండి తెచ్చేరూ?' అంటూ ఐదేళ్ళ వరదం నారాయణరావు దగ్గిరికి పరుగెత్తాడు.

'ఓ, తెచ్చిస్తా!' చేతులు ముందుకు చాస్తూ అన్నాడు నారాయణరావు. అతను ఇలా అనేసరికి అతని దగ్గిరికి వచ్చేశాడు వరదం. వాణ్ణి ఎత్తుకుని, 'ఏం చేస్తావు చిన్నా రైలుబండి?' అన్నాడు నారాయణరావు.

'అందులో కూర్చుని ఢిల్లీ వెళతాను. చిట్టినికూడా తీసుకెళతాను. నాన్నగారిని లేదు. రైలుబండి తేరు. మీరు తెస్తే మిమ్మూ తీసుకెళతాను.' అన్నాడు వరదం.

'ఇంకెవర్ని తీసుకెళ్తావు?'

'ఇంకెవర్నీలేదు.' కొంచెం ఆలోచించి అన్నాడు వరదం.

దగ్గర్లో నారాయణరావు భార్య, లక్ష్మి, కూచుని ఉంది. నారాయణరావు ఆమెని చూపుతూ, 'మీ పెద్దమ్మగారిని తీసుకెళ్ళవూ?' అన్నాడు,

వరదం కొంచెంసేపు పెత్తల్లివైపుచూసి; 'తీసుకెళ్ళను!' అన్నాడు. లక్ష్మి ఎందుకో కోపంగా ఉంది. అది వాడికి నచ్చలేదు.

'మీ పెదనాన్నగారినే తీసుకెళ్లు. నన్ను తీసుకెళ్ళక్కర్లేదు!' చటుక్కున అంది లక్ష్మి.

'పెద్దమ్మగారిని ఎందుకు తీసుకెళ్ళవు?' అడిగాడు నారాయణరావు.

'నన్ను ముద్దు చేయరు!' అన్నాడు వరదం.

'ముద్దు చేస్తే తీసుకెళ్తావా''

వరదంకి సందేహం కలిగింది. లక్ష్మి వాలకం చూసి ఆమె ముద్దు చేస్తుందని వాడికి నమ్మకం కలగలేదు. అంచేత మాటాడక ఊరుకున్నాడు.

'ఏం చిన్నా చెప్పవ్? పెద్దమ్మగారు ముద్దు చేస్తే రైల్లో కూచోబెట్టి తీసుకెళావా?'

వరదం మాట్లాడలేదు.

నారాయణరావు వరదాన్ని భార్యదగ్గరికి తీసుకెళ్ళి, 'ఇదిగో వీణ్ణి ముద్దు చెయ్యి. నిన్నుకూడా తీసుకెళతాడు.' అన్నాడు. కాని, లక్ష్మికి భర్త హాస్యం గిట్టలేదు.

'మీరే రైల్లో కూచుని వెళ్లండి. నేను వెళ్ళను.' అంది కోపంగా.

నారాయణరావు ఆమె మాటల్ని వినిపించుకోక వరదాన్ని ఆమె ఒడిలో కూచోబెట్టేందుకు ప్రయత్నిస్తూ, 'ముద్దు చేయకపోతే రైల్లో కూచోబెట్టడు! ఏం వరదం?' అన్నాడు.

వరదం జవాబివ్వలేదు.

'కూచోబెట్టక్కర్లేదు.' వరదాన్ని ఒడిలోంచి ఒక్క తోపు తోసేసి అంది లక్ష్మి. వరదం కింద పడిపోయాడు. ఒంటికి దెబ్బతగల్లేదుకాని మనస్సు బాధ పడింది. ఏడవ సాగాడు.

నారాయణరావు వాణ్ణి చేరదీసి రైలుబండి తెస్తానని చెప్పి ఊరుకోబెట్టాడు. వరదం భయంతో పెత్తల్లిని చూస్తూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళిపోయినతరవాత, 'వాణ్ణి అలా తోసేశావేం లక్ష్మీ! దెబ్బ తగిలుంటేనో?' అన్నాడు నారాయణరావు.

'తగిలుంటే బాగుణ్ణు! నానెత్తిమీదికెక్కిస్తుంటారేం?' అంది లక్ష్మి.

'దీన్ని నెత్తిమీది కెక్కించడం అంటారా?'

'మీకు మరొకరి కష్టసుఖాలు అక్కర్లేదు. ఎవరి ప్రాణానికి ఎప్పుడు ఏమొస్తుందో చెప్పలేం. ఈ విషయంలో మీకేబాధాలేదు. మీ హాస్యం మీది.'

'పిల్లల అమాయకపు మాటల్ని విని అంతా ఆనందిస్తారు. కాని నువ్వు ఆనందించవు. నీ మనస్సు ఎలాంటిదో నాకు తెలీదు.'

'మీరు ఆనందించవచ్చు. ఆనందిస్తూనే ఉన్నారు. కాని, ఆనందించడానికి అలాంటి పిల్లలుకూడా కావాలి? పైవాళ్ళసొమ్ముతో మన కడుపు నిండుతుందా?'

'నా స్వంత తమ్ముడికొడుకుకూడా పైవాళ్ళ సొమ్మూ' అయితే మనసొమ్మేదో తెలీదు నాకు.'

'వాదించడం బాగా వచ్చు. మీ తమ్ముడి కొడుకు! ఏదైనా అనుకోండి. కాని, నాకీమాటలు నచ్చవు. మా ఖర్మం కాలిపోయింది! లేకుంటే ఈ దుర్దశ ఎందుకు వచ్చేది? మీ ప్రవర్తన లోకానికి విరుద్ధం. పిల్లలకోసం మనుషులు ఎన్నో చేస్తారు. వీటితో మీకేం పనిలేదు. రాత్రీ పగలూ తమ్ముడూ తమ్ముడి పిల్లలూ ఉంటే సరి!'

'అవునవును! ఈ పూజలూ, పునస్కారాలూ, నోములూ, వ్రతాలూ మనకి పిల్లల్ని చేస్తాయి! ఇవన్నీ వట్టి బూటకం. మన భాగ్యంలో లేనిది వీటివల్ల ఎప్పటికీ కలుగదు.'

లక్ష్మి కొంచెం ఏడుపు స్వరంతో, 'ఈ అవిశ్వాసమే అన్నీ పాడు చేసేసింది. అవిశ్వాసంతోనే అంతా కూ చుంటే పనెలా జరుగుతుంది?' అంది.

ఇక ఆమెతో వాదించి లాభం లేదనుకుని మరేమీ అనక అక్కడనుంచి వెళ్ళిపోయాడు నారాయణరావు.

♦ ♦ ♦ ♦

నారాయణరావుకి బాగానే ఆస్తి ఉంది. వ్యాపారం చేస్తున్నాడు. వడ్డీ వ్యాపారంకూడా ఉంది. అతనికి ఒక తమ్ముడు. ఇద్దరన్నదమ్ములూ ఒక్కదగ్గిరే ఉంటున్నారు. నారాయణరావుకి పిల్లలు కలగలేదు. తమ్ముడికి ఇద్దరు పిల్లలు. ఒక కొడుకు, ఒక కూతురు. ఆకొడుకే వరదం.

నారాయణరావుకి తమ్ముడిమీదా, తమ్ముడి పిల్లలమీదా ఎంతో అభిమానం. తమ్ముడి పిల్లల్ని తనపిల్లలకి మల్లే చూసుకుంటాడు.

కాని, నారాయణరావుభార్య లక్ష్మికి పిల్లలు లేకపో వడం చాలా బాధగా ఉంది. రాత్రీ పగలూ పిల్లలకోసమే కలవరిస్తూంటుంది. తమ్ముడి పిల్లలమీద భర్త చూపిన అభిమానం ఆమెకి కంట్లో నలుసులా ఉంటోంది.

రాత్రి భోజనాలయ్యాక చల్లగా గాలి వీస్తూంటే నారాయణరావు పడకకుర్చీలో చేరబడ్డాడు. దగ్గర్లో లక్ష్మి మరొక కుర్చీలో కూచుని చేతిలో తలపెట్టుకుని విచారి స్తోంది. నారాయణరావు లక్ష్మివైపుతిరిగి, 'ఇవాళ నువ్వు వరదాన్ని అలా తోశేశావేం? ఇప్పటికీ నా మనస్సు కొట్టుకుంటోంది. అప్పుడప్పుడూ నీ వ్యవహారం అమానుషంగా ఉంటోందేం?' అన్నాడు.

'మీరే నన్నిలా తయారు చేశారు. ఆ పండితుడు మనిద్దరి జాతకాల్లో సంతానయోగం ఉందనే చెప్పాడు. అతను కొన్ని క్రియలు కూడా చెప్పాడు. కాని, మీరు అందులో ఒక్కటీ చేసి చూడలేదు. అంతే. ఇక ఈపిల్లలతో కలిసిపోయారు. మనిషి ప్రయత్నం చేసి చూడాలి. తరవాత అయ్యేదీ లేనిదీ ఆ భగవంతుని చేతుల్లో ఉంది.' అంది లక్ష్మి.

నారాయణరావు నవ్వి, 'ఈ జ్యోతిష్కుల మాటలు నమ్ముతున్నావా? పచ్చి అబద్ధాలు! అబద్ధాలు చెప్పే అన్నం తింటున్నారు.' అన్నాడు.

'మీకు ప్రపంచం అంతా అబద్ధంగా కనబడుతుంది. ఈ పురాణాలూ, ప్రబంధాలూ కూడా అబద్ధాలా? ఏం ఇంగ్లీషు చదువో! అంతా అబద్ధం అంటారు.'

'నీవు గ్రహించలేవు. నీమాట నీదే.'

'మీరు గ్రహిస్తూనే ఉన్నారు. అంచేతే నేను రాత్రీ పగలూ దహించుకు పోతూన్నాను. సరేగాని చెప్పండి మీతదనంతరం ఈపిల్లలే మీపేరు నిలబెడతారా?'

నారాయణరావు నవ్వి, 'మంచి ప్రశ్నే వేశావు! పేరు ప్రతిష్ఠలు పిల్లలవల్ల నిలవవు. తమతమ సంస్కృతుల వల్లనే నిలుస్తాయి. హరిశ్చంద్రుడంటే దేశంలోని ప్రతి వ్యక్తికీ తెలుసు. తెనాలి రామకృష్ణుడు చనిపోయి ఎన్నాళ్ళయింది? ఇలా ఎందరో మహాత్ములు పోయారు. వీరందరిపేర్లూ వీరివల్లనే నిలుపుతూన్నారా?'

♦ ♦ ♦ ♦

ఎంతగొప్పవస్తువైనా అది ఇతరులదని అనుకున్నంత వరకూ మనిషి దాన్ని ప్రేమించలేడు. ఎలతపనికిరాని వస్తువైనా తనదయ్యేసరికి దాన్ని ప్రేమిస్తాడు.

లక్ష్మి మనస్సు పిల్లలమీదికి పోతూనే ఉంది. కాని, ఆ పిల్లలు పైవాళ్ళదని జ్ఞాపనం వచ్చేసరికి ఆమెకి వాళ్ళ మీద ఎక్కడలేనిద్వేషం కలుగుతోంది. విశేషించి తన భర్త తనదికాని పిల్లల్ని ప్రేమించడం చూసేసరికి ఈ ద్వేషం మరీ ఎక్కువ అవుతుంది.

అది సాయంకాలం. లక్ష్మి గాలికని మేడమీద కూచుంది, పిల్లలిద్దరూ మేడమీదే ఆడుకుంటూన్నారు. లక్ష్మి వాళ్ళ ఆటల్ని చూస్తోంది. వాళ్ళ ఆటపాటలు అమెకి ఆవేళ చాల బాగుంటోంది. గాలిలో ఎగిరే రాళ్ళ ముంగుర్లు కమలాల్లా కళకళ్ళాడే వాళ్ళ ముఖాలూ, ముద్దొచ్చేవాళ్ళమాటలూ, వాళ్ళ పరుగెత్తడాలు ఆమెకి ఎంతో ముచ్చట కలిగిస్తూన్నై.

హఠాత్తుగ వరదం చెల్లెల్ని కొట్టేందుకు పరిగెత్తాడు. అది అందకుండా నవ్వుతూ పరిగెత్తి లక్ష్మి ఒళ్ళో పడ్డది, దానివెనకనే వరదంకూడా పరిగెడుతూవచ్చి ఆమె ఒడిలో పడ్డాడు. లక్ష్మి వాళ్ళని హృదయానికి గట్టిగా హత్తుకుంది. ఇద్దరూ ఆమె ఒళ్ళో చాలసేపు ఆడుకున్నారు. హఠాత్తుగ ఎవరో వచ్చే అలికిడైంది, లక్ష్మి లేచిపోయింది.

'వరదం! ఇదిగో రైయిలుబండి!' అంటూ నారాయణ రావు మేడమీది కొచ్చాడు. అతనిగొంతు వింటూనే పిల్లలిద్దరూ లక్ష్మి ఒడిలోంచి లేచిపరిగెత్తారు. నారాయణరావు వాళ్ళని ముద్దుచేసి రైలుబండిని చూపసాగాడు.

ఇటు లక్ష్మికి నిద్ర వదలినట్టయింది. పిల్లలతో కలిసి పోయిన భర్తని చూసి ఆమె మండిపోయింది. పిల్లల మీద మళ్ళా ఆ కోపం రగుల్కొంది. పిల్లలికి రైలు బండిని ఇచ్చేసి నారాయణరావు లక్ష్మిదగ్గిరికివచ్చి నవ్వుతూ, 'ఇవాళ పిల్లలమీద చాల ప్రేమగ ఉందే! దీనివల్ల నీక్కూడా వాళ్ళమీద అభిమానం ఉందని తెలుస్తోంది.' అన్నాడు.

లక్ష్మికి ఈమాటలు ఏమాత్రం నచ్చలేదు. ఆమె తన బలహీనానికి విచారించింది. విచారమే కాదు, తనమీద తనకు కోపం కూడా కలిగింది. తన బలహీనం భర్తకు తెలిసిపోవడం ఆమె భరించలేకపోయింది.

'అంచేత మనం పిల్లలకోసం తాపత్రయపడడం దండుగని అంటాను. వీళ్ళని ప్రేమిస్తే నీకూ వీళ్ళే నీ పిల్లలని తోస్తుంది.' అన్నాడు నారాయణరావు.

'నాకేం అవసరం వీళ్ళని ప్రేమించేందుకు? గతిలేక మీరే ప్రేమిస్తారుగాని. ఒకే ఇంట్లో ఉండడంవల్ల అప్పుడప్పుడూ నవ్వులూ దెబ్బలాట తప్పవు. మొన్నను ఇలా తోశానో లేదో నానామాటలన్నారు.' అంది లక్ష్మి.

భార్యమాటలు వినగానే నారాయణరావుకి చాలకోపం వచ్చింది. 'నువెలాంటి హృదయంగల స్త్రీవో నాకు బోధపడకుండా ఉంది. ఇందాకనే అంత చక్కగ కూచుని పిల్లల్ని ముద్దు చేస్తూంటివి. నేను రాగానే ఊసరవెల్లీలా రంగులు మారుస్తూన్నావు.' గట్టిగా అన్నాడు.

లక్ష్మి జవాబివ్వలేదు. తన కోపాన్ని కళ్ళద్వారా ప్రదర్శించింది.

నారాయణరావుకి పిల్లలమీద అభిమానం ఎంతగా ఎక్కువ అవుతుందో లక్ష్మి? ద్వేషం అంతగా ఎక్కువ కాసాగింది. అప్పుడప్పుడూ పిల్లలవెనక భార్యాభర్తలు కీచులాడుకునేవారు. పిల్లలమూలాన తను భర్తకి లోకువ అవుతూండడం చూసేసరికి లక్ష్మి హృదయంలో తుఫాను చెలరేగింది. 'పరాయి పిల్లలమీద పడి దినమస్తమానమూ మొత్తుకుంటారు. పిల్లలెవరికి సర్వస్వమూను, నా అవసరం ఏమీలేదు. లోకం చస్తోంది కాని ఈ పిల్లలికి చావు రాదు.' అనుకుంది. ఇలా కొన్నాళ్ళు గడిచాయి. ఒక రోజు లక్ష్మి మామూలుగా మేడమీద కూచుంది. అనేక ఆలోచనలు ఆమె మనస్సులో మెదులుతూన్నై. అది పాతవే. తనకు పిల్లలు లేకపోవడం, భర్త తమ్ముడి పిల్లల్ని ప్రేమించడం మొదలైనవి. ఒక క్షణం తరవాత ఆమె లేచినిలుచుని మేడమీద ఇటూ అటూ తిరగ

సాగింది. అంతలో వరదం అక్కడికి వచ్చాడు. వరదాన్ని చూసి ఆమె కంటగించుకుంది. ఒక స్తంభానికి ఆనుకుని నిలుచుండిపోయింది.

అది సాయంత్రం. ఆకాశంలో రకరకాల గాలిపటాలు ఎగరేస్తున్నారు. వరదం వాటిని కొంచెంసేపు చూసి ఏదైనా తెగి వాళ్ళ మేడమీదపడిపోతే బాగున్నని అనుకున్నాడు. మరికొంచెంసేపు ఏచైలు పడుతుందేమోనని చూసి లక్ష్మిదగ్గరికొచ్చి 'పెద్దమ్మగారూ! నాకో గాలిపటం కొనీరూ?'

'పో అంటె. పెదనాన్నాగారినే కొనిపెట్టమను, 'విదలించుకుని అంది లక్ష్మి. వరదం కొంంచెంసేవు స్తంభించిపోయి మళ్ళా ఆకాశంవైపు ఆశగా చూడసాగాడు. మరోక్షణం తరవాత ఉండబట్టలేక మళ్ళా చాల దీనంగా. 'పెద్దమ్మగారూ!గాలిపటం ఒకటి కావాలి?' అన్నాడు.

ఈమారు వాడు జాలిగొలిపే మాటలువిని లక్ష్మిమనస్సు కొంచెం కరిగింది. వాడివైపుచూసి 'వీడు నాకొడుకై ఉంటే నాకన్నా పుణ్యాత్మురాలు ఈ లోకంలో మరొకత్తె ఉండదు. ఎంత ముద్దొస్తాడు ఎలా చిలకలా మాట్లాడతాడు. ఎత్తుకుని హృదయానిహత్తుకునేనా అనిపిస్తోంది!' అని మనసులో అనుకుంది.

అనుకుని ఆమె వరదంతలని నిమురుతూండగా ఆమె మౌనాన్నిచూచి, 'నాకు గాలిపటం కొనివ్వకపోతె పెదనాన్నగారికి చెప్పి కొట్టిస్తా.' అన్నాడువరదం.

'ఏమిటీ! అలానే కొట్టించు!' కళ్ళెర్రగాచేసి ఒక్క-



సంగీతావారి సాంఘిక చిత్రం 'ఇంటిగుట్టు'లో శ్రీమతి సావిత్రి, శ్రీ గుమ్మడి.

మారు గట్టిగా అంది లక్ష్మి.

వరదం భయపడి ఆమె దగ్గిరనుంచి వెళ్లిపోయాడు. మళ్ళా ఆశగా ఆకాశంలో ఎగిరే గాలిపటాల్ని చూడసాగడు. అదేసమయంలో ఒక గాలిపటంతెగి వాళ్ళ మేడవైపు వచ్చింది. వరదం కిందికి వెళ్ళేందుకు గబగబా మెట్లు దిగసాగాడు. కాని, ఆ తొందర్లో కాలు జారి దొర్లిపోయాడు. 'పెద్దమ్మగారూ!' కేకవేశాడువాడు. ఆ దృశ్యాన్నిచూసి, 'చావనీ! పీడ విరగడయిపోతుంది!' అనుకుని అలానే నిలుచుండిపోయింది లక్ష్మి. వరదం మెట్లమీదినుంచి దొర్లిపోతూన్నాడు. ఒళ్లు హూనం అయిపోతోంది. భయంతో బాధతో కొట్టుకుంటూ మరో మారు లక్ష్మివైపుచూసాడు. లక్ష్మికళ్లు వాడికళ్లతో కలిసాయి. ఆ స్థితిలోని వాడికళ్ళని చూసేసరికి ఆమె మరి ఉండలేక పోయింది. ఆమెహృదయం కరిగిపోయింది. వెంటనే వాణ్ని పట్టుకునేందుకు పరిగెత్తింది. కాని, లాభంలేకపోయింది. ఆమె పట్టుకునేలోగా వాడు కిందికి దొర్లిపోయాడు, ఒక్క కేకవేసి ఆమెవెనక్కి పడిపోయింది.

ఆ పడిపోవడంలో ఆమెకి స్పృహ తప్పిపోయింది. ఉష్ణం వచ్చి ఒక వారంరోజులవరకు తెలివి రాలేదు. మధ్యమధ్య కలవరింపులు వచ్చాయి. 'పట్టుకోండి! నా వరదాన్ని పట్టుకోండి! నాన్నా వరదం! నేను చూస్తూనే నిన్ను కాపాడలేకపోయాను. ఎంత పాపిష్టిదాణ్ణి!'

వరదంకి బాగా దెబ్బలు తగిలాయి. కట్లు కట్టారు. మెల్లిగా కోలుకోసాగాడు.

ఒకవారం తరవాత లక్ష్మికి ఉష్ణం తగ్గింది. బాగా తెలివి వచ్చినతరవాత, 'వరదం ఎలా ఉన్నాడు?' అని అడిగింది.


'బాగానే ఉన్నాడు,' అన్నాడు నారాయణరావు.

'వాణ్ణి నా దగ్గిరికి తీసుకురండి.'

వరదాన్ని లక్ష్మి దగ్గిరికి తీసుకొచ్చారు. లక్ష్మి వాణ్ణి గట్టిగా హృదయానికి హత్తుకుని ఏడ్చింది. కళ్లల్లోంచి ధారగా నీళ్ళు కారసాగాయి. దుఃఖంతో ఆమె గొంతుకు బొంగురు పోయింది.

•••

వెంకటేశ్వరా వారి
'సతీసుకన్య'లో
శ్రీ అమరనాథ్, కృష్ణకుమారి.



•••